సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 24 । మార్చి । 2023



న్యూస్‌రీల్

31న వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలు ఈనెల 31న నిర్వహించనున్నట్లు ప్రస్తుత అధ్యక్షుడు ఈ.ఆనంద్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కోర్టు అవరణలోని అసోసియేషన్ అంబేద్కర్ హాల్‌లో నామినేషన్ల దాఖలు ఉంటుందని, 25న నామినేషన్ల పరిశీలన, విరమణ, సాయంత్రం 5 గంటలకు బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన ఉంటుందని తెలిపారు. 28న అభ్యర్థుల పరిచయ కార్యక్రమం, 31న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, అనంతరం లెక్కింపు.. విజేతల ప్రకటించనున్నట్లు వివరించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ ఎన్నికలు ఒకే రోజు (31న) జరగనున్నాయి.

425మంది గైర్హాజరు

విద్యారణ్యపురి/కాశోజీ సెంటర్: హనుమకొండ జిల్లాలోని 49 కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ఫస్టియర్ మాథ్స్–బీ పరీక్షలో 425మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 17,278మందికి 16,853మంది పరీక్షలకు హాజరుకాగా, 425మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ గోపాల్ తెలిపారు. అదేవిధంగా వరంగల్ జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 305 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు. 27 పరీక్ష కేంద్రాల్లో 5,457 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 5,152 మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు.

27న 'నిధి ఆప్కే నికత్ 2.0'

హన్మకొండ అర్బన్: ఈపీఎఫ్ఓ సభ్యులు, యజమానులు, పెన్షనర్ల ఫిర్యాదులు పరిష్కరించేందుకు ఈనెల 27న నగరంలోని నిట్ క్యాంపస్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిధి ఆప్కే నికత్ 2.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు రీజనల్ పీఎఫ్ కమిషనర్ ప్రణీత్‌జోషి గురువారం తెలిపారు. పీఎఫ్ సభ్యులు, యజ మానులు, పెన్షనర్లు హాజరై ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన



విద్యారణ్యపురి: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, ఎయిడెడ్ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం హనుమకొండ, వరంగల్ జిల్లాలోని ట్రెజరీ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు రెండు జిల్లాల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ సుబేదారిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర బాధ్యులు నన్నబోయిన తిరుపతి, ఆర్.రమేశ్, డీటీఎఫ్ రాష్ట్ర బాధ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ పెండెం రాజు, పోరాట కమిటీ రెండు జిల్లాల బాధ్యులు సదాశివరెడ్డి, టి.కుమార్, టి.సుదర్శనం, శ్రీనివాస్, గోవిందరావు, బైరి స్వామి, మనోజ్‌గౌడ్, లక్ష్మయ్య, కుమారస్వామి పాల్గొని మాట్లాడారు. బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మధ్యాహ్నం 3–30 గంటలకు రెండు జిల్లాల ట్రెజరీ కార్యాలయాల ఎదుట జరిగే నిరసన ప్రదర్శనలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, సమస్యలు తెలుసుకోవడానికి శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ బాబు నాయక్ గురువారం తెలిపారు. హనుమకొండలోని డిపో కార్యాలయం నుంచి ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జమ్మికుంట, కమలాపూర్, హసన్‌పర్తి, వేలేరు, ధర్మసాగర్, కాజీపేట, హనుమకొండ, వరంగల్, ఖిలా వరంగల్, నడికుడ, ఐనవోలు, పర్వతగిరి మండలాల ప్రయాణికులు 99592 26049 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, సమస్యలు తెలపాలని కోరారు.

భద్రకాళి మాతకు పుష్పార్చన

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం కాశీమల్లెపూలతో (కాగడ మల్లె) అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. శ్రీవీరాంజనేయస్వామి దేవాలయంలో పూజల నిమిత్తం ఉప్పల్ రామాలయం వంశపారంపర్య ధర్మకర్త వేనాతుకూరి రాఘవదాస్ శ్రీహనుమత్ శ్రీలక్ష్మణ సమేత శ్రీసీతారామచంద్రస్వామి వార్ల పంచలోహ విగ్రహాలను అందజేశారు. శేషు అధ్వర్యంలో ఉత్సవమూర్తుల చరప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.



అమ్మవారికి కాశీమల్లెపూలతో పుష్పార్చన నిర్వహిస్తున్న వేద విద్యార్థులు

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: ఆధునిక రోగాల నివారణలో సిరి ధాన్యాలు ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నాయని, ఇందుకు ప్రతి ఒక్కరికి పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. పోషణపక్షంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ అధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సబిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిక్తా పట్నాయక్ పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా కొర్రలు, అరికలు, సామలు, ఊదలు, రాగులు, సజ్జలు, వరిగులు, జొన్నలు మొదలైన వాటి ద్వారా ఆధునిక కాలంలో వచ్చే రోగాలకు దూరం చేసుకోవచ్చని సూచించారు. స్వయం సహాయక సంఘాలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు, ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు పౌష్టికాహారం, సిరిధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు శ్రీనివాస్‌కుమార్,జగదీశ్వర్, బి.సాంబశివరావు, వసంత రాణి, నిర్మల, రామారావు, రాధాదేవి, భాగ్యలక్ష్మి, పి.స్వరూప, సుమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

పవన్ కల్యాణ్‌ను కలిసిన నిట్ డైరెక్టర్

కాజీపేట అర్బన్: నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు హైదరాబాద్‌లో పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్‌ని తన నివాసంలో గురువారం కలిశారు. నిట్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే స్ప్రింగ్‌స్ప్రీ–23 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు. వేడుకలకు హాజరయ్యేందుకు సుముఖత వ్యక్త పరిచినట్లు డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. డీన్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వయిజర్ హీరాలాల్, ప్రొఫెసర్లు ఆనంద్‌కిషోర్, హరికృష్ణ, స్టూడెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పెద్దవంగర మండలం రెడ్డికుంటతండాలో ధ్వంసమైన మిరప చేనును పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక తదితరులు



నేనున్నాను..!

అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు సీఎం కేసీఆర్ భరోసా

- పంటలను పరిశీలిస్తూ.. బాధలు వింటూ...
- మీ కన్నీళ్లు తుడిచి ధైర్యం నింపేందుకే వచ్చా
- రైతులకు పరామర్శ...పరిహారమిస్తానని హామీ
- ఫొటో గ్యాలరీ చూసి ఉద్వేగానికి లోనైన సీఎం
- మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో పర్యటన

'అకాల వర్షం రైతులను నట్టేట ముంచింది. నష్టపోయిన చేన్లను చూస్తుంటే బాధేస్తుంది. రైతులు అధైర్యపడొద్దు.. మీరు ధైర్యంగా ఉంటేనే నేను గుండెనిబ్బరంతో ఉంటా. మీ కన్నీళ్లు తుడిచి గుండెధైర్యం నింపేందుకు వచ్చా' అంటూ అకాల వర్షం, వడగళ్లతో నష్టపోయిన రైతులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఓదార్పునిచ్చారు. మీకు నేనున్నానంటూ భరోసా కల్పించారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రెడ్డికుంట తండా, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం అడవిరంగాపురంలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పర్యటించారు.

- సాక్షి, వరంగల్/సాక్షి, మహబూబాబాద్/పెద్దవంగర/దుగ్గొండి



అడవిరంగాపురంలో వడగళ్లతో దెబ్బతిన్న మొక్కజొన్న చేను, నీటిపైప్‌ను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

సీఎం పర్యటన ఎలా సాగిందంటే...

- **మధ్యాహ్నం 1:33 గంటలకు:** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రెడ్డికుంట తండాలో సీఎం కేసీఆర్ హెలికాప్టర్ ల్యాండ్ అయ్యింది.
- **1:43:** ప్రత్యేక బస్సులో పంటనష్టపోయిన రైతుల వద్దకు చేరుకున్నారు.
- **1:58 :** మొక్కజొన్న, మిర్చి, మామిడి తోటలను కోల్పోయిన రైతులతో మాట్లాడారు.
- **2:00 – 2:06:** అక్కడ ఏర్పాటు చేసిన వేదిక వద్ద రైతులనుద్దేశించి మాట్లాడారు.
- **2:21:** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం అడవిరంగాపురం బయలుదేరారు.
- **2.39 :** అడవిరంగాపురంలో సీఎం కేసీఆర్ హెలికాప్టర్ ల్యాండ్ అయింది.
- **2.43 – 2.45:** పంటనష్టం ప్రదర్శన తిలకించారు.
- **2.50 :** రజనీకర్ రెడ్డి సాగుచేసిన మొక్కజొన్న చేనును పరిశీలించారు.
- **2.55:** వరి రైతులు సామ్రాజ్యం దంపతులతో మాట్లాడారు.
- **3.06:** ఆవుల అమర్‌కు చెందిన టమాటాలను పరిశీలించి అతనితో మాట్లాడారు.
- **3.13 :** చుట్టుపక్కల గ్రామాలనుంచి వచ్చిన పంట నష్టపోయిన 20 మంది రైతులతో మాట్లాడారు.
- **3.25 నిమిషాలకు :** కరీంనగర్ బయలుదేరి వెళ్లారు.

- వివరాలు 8లో ▸

..మనసాక్షిగా

ప్రజల సమస్యలపై అక్షరాయుధమై..

- అధికార యంత్రాంగాన్ని కదిలించి.. అక్రమార్కుల భరతం పట్టించి..
- 15 ఏళ్ల ప్రస్థానంలో అనుక్షణం ప్రజల పక్షమై..
- ఆపన్నులకు అండగా నిలిచి.. ఆత్మ నిబ్బరం ఇచ్చిన వైనం

పేదలు, అణగారిన వర్గాలకు 'సాక్షి' గొంతుకైంది. ఉమ్మడి వరంగల్‌లో 'సాక్షి' స్వరం పొలికేకై, మూగవోయిన గొంతులకు స్వరాన్ని, గుండె ధైర్యాన్ని, ఆత్మ నిబ్బరాన్నిచ్చింది. వ్యవస్థల్ని చెరబట్టిన వారు దుర్బుద్ధితో దాపెట్టిన నాణెపు రెండో పార్శ్వాన్ని ఆవిష్కరించింది. నిజాన్ని నిజంలా చెబుతామని సంకల్పం తీసుకొని నేటికి సరిగ్గా పదిహేనేళ్లయ్యింది. ఈ ప్రస్థానంలో ఎన్నో ప్రజా సమస్యలకు పరిష్కార వేదికైంది. అధికార యంత్రాంగాన్ని కదిలించింది. అక్రమార్కుల భరతం పట్టింది. ఎందరో ఆపన్నులకు అండగా నిలిచింది.

- సాక్షిప్రతినిధి, వరంగల్/సాక్షి, వరంగల్/భూపాలపల్లి/కేసముద్రం/మంగపేట/కాజీపేట



డానియెల్ కేసులో 'సాక్షి' తనదైన ముద్ర





వరంగల్ నగరం నడిబొడ్డున మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో నివసించే సంచార జాతులకు చెందిన ఆర్య, ఐశ్వర్యల రెండేళ్ల కుమారుడు మిస్సింగ్‌పై సాక్షి 2021, అక్టోబర్ 20న 'డానియెల్ ఎక్కడ' అంటూ ఇచ్చిన కథనం పోలీసుల్లో కదలిక తెచ్చింది. అప్పటి వరంగల్ సీపీ తరుణ్ జోషి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షించి.. ఆ పిల్లాడి జాడ కనుగొనేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇలా హైదరాబాద్‌లో డానియెల్‌ను అక్టోబర్ 24న ఎట్టకేలకు కనిపెట్టి తల్లిదండ్రులు ఆర్య, ఐశ్వర్యలకు అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ తరుణ్ జోషి ప్రత్యేకంగా సాక్షికి ఫోన్ కాల్ చేసి బాబు దొరికాడని చెప్పారు. ఇంకోవైపు ఆ బాబు తండ్రి ఆర్య సాక్షికి ఫోన్ కాల్ చేసి మా బాబు డానియెల్ దొరకడంలో మీ పత్రిక పాత్ర మరువలేనిదని, ఈరోజు మీ వల్లనే మా డానియెల్ దొరికాడని కృతజ్ఞతలు తెలిపారు.





శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం నిమగ్నమయ్యే పోలీసు శాఖలో కొందరు అధికారుల భూదందాలు, సెటిల్‌మెంట్లపై 'సాక్షి' బాధితుల ఫిర్యాదులు, ఇన్వెస్టిగేషన్ కథనాలు రాసింది. రెండున్నరేళ్ల కాలంలో ఐదుగురు సీఐలు, ముగ్గురు ఎస్‌ఐలను సస్పెండ్ చేయడంతోపాటు ఓ డీసీపీ, ఓ ఏసీపీ, ఏడుగురు సీఐలు, ఎస్‌ఐలపై బదిలీ వేటు వేసింది.

బ్రిడ్జి వచ్చింది.. వ్యథ తీరింది



ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు నర్సింహసాగర్ గ్రామాల మధ్య మల్లూరువాగుపై బ్రిడ్జి లేక అవతలి గ్రామాలైన నర్సింహసాగర్, శనిగకుంట, పూరేడుపల్లి, బాలన్నగూడెం పంచాయతీ పరిధిలోని నీలాద్రిపేట గ్రామాలకు పూర్తిగా రవాణా సౌకర్యం నిలిచిపోయేది. 2008 నుంచి వర్షాకాలంలో ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ప్రత్యేక కథనాలు ప్రచురించింది. స్పందించిన అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి 2018–2019 ఆర్థిక సంవత్సరంలో వాగుపై 45 మీటర్ల బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేశారు.

అనాథ చిన్నారులకు చేయూత..








తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు అనాథ చిన్నారుల దీనగాథపై 2021, జనవరి 7న 'అయ్యో పాపం' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితంకాగా.. దాతలు ఆదుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రం శివారు బడితండాకు చెందిన బానోత్ లత, ఆశోక్‌లు అనారోగ్యంతో చనిపోగా, వారి పిల్లలు చరణ్, కుమార్తెలు శ్రద్ధ, సమృద్ధిలు అనాథలయ్యారు. సగంలో ఉన్న ఇంట్లోనే బతుకుతున్నారు. వారి దుర్భర జీవనంపై సాక్షి ప్రచురించిన కథనం పలువురిని కదిలించింది. దాతలు ముందుకొచ్చి ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. పిల్లలకు అవసరమైన వస్తువులు అందించారు. పూర్తయిన ఇంటిని అప్పటి మహబూబాబాద్ కలెక్టర్ గౌతమ్, పిల్లలతో కలిసి 2021, ఏప్రిల్ 7న గృహప్రవేశం చేశారు. అనాథ పిల్లలకు అండగా నిలిచి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన 'సాక్షి' దినపత్రికకు బడితండావాసులు, అధికారులు, దాతలు కృతజ్ఞతలు తెలిపారు.

'సాక్షి' మేలు మరువలేం..



అమ్మానాన్నలు చనిపోయినప్పుడు మాకు ఎంతో బాధకలిగింది. ఆ తర్వాత బడి బంద్ కావడంతో మధ్యాహ్న భోజనం లేక ఇబ్బందులు పడ్డాం. ఇల్లు సరిగా లేక వర్షం పడినప్పుడల్లా నిద్రపట్టక గోస పడ్డాం. కానీ మా బాధను 'సాక్షి' పేపర్‌లో రాయడం వల్ల అధికారులు, దాతలు వచ్చి సాయం చేశారు. సాక్షి పత్రిక మాకు చేసిన మేలు ఎన్నడూ మరువలేం.

- చరణ్, శ్రద్ధ, సమృద్ధి





హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపూర్ గ్రామం. ఈ గ్రామం వరంగల్–హైదరాబాద్ హైవేలో ఉంటుంది. ఇక్కడ భూముల ధరలు కోట్లల్లో ఉన్నాయి. దీంతో అక్కడ ఒక అమాయక కుటుంబానికి సంబంధించి విలువైన స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. భూమికి సంబంధించి పూర్వాపరాలు సేకరించారు. రెవెన్యూ రికార్డులు సక్రమంగా లేవని తెలుసుకున్న కబ్జాదారులు ఆ భూమిపై కన్నేశారు. కబ్జాకు చక్రం తిప్పగా ఓ తహసీల్దార్ సహకరించారు. ఈ వైనంపై కథనం రాయడంతో గుట్టురట్టయ్యింది. కలెక్టర్ సిక్తా పట్నాయక్ విచారణకు ఆదేశించారు.







భూపాలపల్లి మున్సిపాలిటీలో నత్తనడకన జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య లోపం, తాగునీటి సమస్య, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 2022 మే నెలలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అదనపు కలెక్టర్ పలుమార్లు మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి మందలించారు. అభివృద్ధి పనుల నివేదికను అందజేయాలని ఆదేశించారు.



సాక్షి కథనాల ఫలితంగా ఆర్‌ఓబీ

కాజీపేట పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏ చిన్న ప్రమాదం జరిగినా తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ఒక్కోమారు గంటసేపటికి పైగా బ్రిడ్జికి ఇరువైపులా కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు బారులు తీరుతుంటాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని సాక్షి సమాంతర బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ 2016లో వారం రోజులపాటు వరుస కథనాలు వెలువరించింది. అన్ని రాజకీయ పక్షాలను ఐక్యం చేసి ఆందోళనలు చేయించడంతో ప్రజాప్రతినిధులు స్పందించి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి రూ.79కోట్ల నిధులు మంజూరు చేయించారు. 2019లో సీఎం కేసీఆర్ పనులను ప్రారంభించడంతో పాత బ్రిడ్జికి సమాంతరంగా నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతున్నాయి.

సాక్షి చొరవతోనే..



కాజీపేట రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సాక్షిలో వచ్చిన వరుస కథనాలు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడానికి ఎంతగానో దోహదపడ్డాయని చెప్పొచ్చు. వారం రోజులపాటు వార్తలు ఇవ్వడమే కాక జిల్లా ప్రజాప్రతినిధులను ఒకతాటిపైకి తెచ్చి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఘనతను సాక్షి దక్కించుకుంది.

- ఉడుతల బాబురావు, కాజీపేట

నేడు ఆదాయపు పన్నుపై అవగాహన

వరంగల్ చౌరస్తా: ఆదాయ పన్ను నోటీసులు, టీడీఎస్ చెల్లింపులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ చైర్మన్, సీఏ రాయబారపు హరికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ హంటర్ రోడ్డు సాయి నగర్‌లోని ఎస్సార్బీ ఆఫ్ ఐసీఏఐ భవన్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపార, వాణిజ్య సంస్థ ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడండి

ఆమెజాన్ యాప్‌లోనూ చెల్లింపులకు అవకాశం

వరంగల్ అర్బన్ : పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని బల్దియా ఇన్‌చార్జ్ కమిషనర్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆస్తి, నీటి, ట్రేడ్ లైసెన్స్ పన్నులు చెల్లించేందుకు 8 రోజుల గడువు మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు మీ సేవా కేంద్రాలు పన్నుల స్వీకరణకు రాత్రి 9గంటల వరకు తెరిచి ఉంటాయని తెలిపారు. బల్దియా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్ రాత్రి వరకు బకాయిదారుల వరకు వద్దకు వెళ్లి పన్నులు వసూలు చేయాలని కోరారు. అమెజాన్ యాప్‌లో కూడా పన్నులు చెల్లించే సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. అపరాధ రుసుము లేకుండా నెలాఖరులోగా పన్నులు చెల్లించాలన్నారు. నగరానికి చెందిన ఎస్ఆర్ కళాశాల నిర్వాహకులు బకాయి పడి ఉన్న ఆస్తిపన్ను రూ.5,00,860 చెక్‌ను గురువారం అందజేశారు.

నేడు, రేపు బాలవికాసలో చర్చాగోష్ఠి

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ బాల వికాస సెంటర్‌లో సెంట్రల్ తెలంగాణ జోన్ రీజనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు గురువారం ఏడీఆర్ ఆర్ఏఆర్ఎస్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జోనల్ వ్యవసాయ విస్తరణ, పరిశోధన మీద రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో చర్చాగోష్ఠి ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు.

టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

విద్యారణ్యపురి: వచ్చే నెల 3వ తేదీనుంచి నిర్వహించబోయే టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవసేన అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి జిల్లా విద్యాశాఖాధికారులు, పరీక్ష నిర్వహణ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగిన ఆదేశాలు ఇచ్చారు. జిల్లానుంచి విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఏసీజీ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి టెన్త్ హాల్‌టికెట్లు

విద్యారణ్యపురి/కాశోజీ సెంటర్: ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లు శుక్రవారం నుంచి ప్రభుత్వ పరీక్షల వెబ్‌సైట్(ఆన్‌లైన్) పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని హనుమకొండ, వరంగల్ డీఈఓలు అబ్దుల్‌హై, వాసంతి, ఏసీజీ చలపతిరావు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల పేర హాల్ టికెట్లు ఇవ్వకపోతే నేరుగా వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.


అడవి రంగాపురంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న సీఎం, అధికారులు


అడవి రంగాపురంలో దెబ్బతిన్న టమాట పంటను పరిశీలిస్తున్న సీఎం


బస్సులోనే భోజనం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, వడ్డిస్తున్న మంత్రి

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661


సీఎం కేసీఆర్ వస్తున్న హెలికాప్టర్

FATHIMA HIGH SCHOOL
Mahabubabad, Thorrur Road, Cell: 9989942147
WANTED TEACHERS
Applications are invited from qualified teachers to teach the following subjects
HIGH SCHOOL
• Maths • Computers • P.E.T •
PRIMARY
• Telugu • Hindi • Maths • EVS
PRE-PRIMARY : • KG - 02
Note : Fluency in English is must
Interested and eligible candidates are Invited to Submit the applications on or before 2nd April, 2023 with complete Bio_Data and set of Xerox copy of Certificates
Sd/- PRINCIPAL

రెడ్డికుంటతండాలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం



అడవి రంగాపురంలో పంట నష్టంపై వివరిస్తున్న అధికారులు



రెడ్డికుంటతండాలో పంట నష్టం ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం



నేనున్నాను..!

అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు సీఎం కేసీఆర్ భరోసా

సాక్షి, వరంగల్/సాక్షి, మహబూబాబాద్/పెద్దవంగర/దుగ్గొండి: వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు 'నేనున్నా' అంటూ సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రెడ్డికుంట తండాలో, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం అడవిరంగాపురంలో వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలను ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం పరిశీలించారు. హెలికాప్టర్ దిగినప్పటి నుంచి తిరిగి హెలికాప్టర్ ఎక్కే వరకు సీఎం రైతుల బాధను వింటూ.. భరోసా కల్పిస్తూ.. ధైర్యాన్ని నింపుతూ పర్యటన సాగింది.

కౌలు రైతులకు పరిహారం..

ఆయా చోట్ల పంటలను పరిశీలించిన అనంతరం సీఎం రైతులతో మాట్లాడారు. ఎకరాకు రూ.10వేల నష్ట పరిహారం ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. నిజ రైతులతో పాటు కౌలు రైతులకు కూడా నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. భూ యజమానులు పెద్ద మనసు చేసుకుని వారికి సహకరించాలన్నారు. అర్హులైన కౌలు రైతులను పరిహారం అందేలా కలెక్టర్ చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, సీఎస్ శాంతకుమారి, సీఎం ఓఎస్డీ స్మితా సబర్వాల్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, తక్కెళ్ల పల్లి రవీందర్‌రావు, ఎంపీలు పసునూరి దయాకర్, సంతోష్‌కుమార్, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు, కలెక్టర్లు శశాంక, ప్రావీణ్య, వరంగల్ సీపీ రంగనాథ్, మానుకోట ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, ఆర్డీఓ రమేష్, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్య శర్మ, ఎంపీపీ ఈదురు రాజేశ్వరీ, జెడ్పీటీసీ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టిని ఆకర్షించిన పంటల ప్రదర్శన

దుగ్గొండి: పంట నష్టం పరిశీలనలో భాగంగా రెడ్డికుంటతండా, అడవి రంగాపురంలో ఏర్పాటు చేసిన పంటల ప్రదర్శనను సీఎం కేసీఆర్ తిలకించారు. వ్యవసాయ, ఉద్యానవనశాఖల ఆధ్వర్యంలో నష్టాన్ని కళ్లకు కట్టినట్టు చూపించేలా పంటలను ఏర్పాటు చేశారు.

అడవిరంగాపురంలో చాపలబండ, మందపల్లి, గిర్నిబావి, పీజీతండా, రాజ్యతండా, మదిర, గొబ్రియా తండా గ్రామాలకు చెందిన 20 మంది రైతులు అరటి, బొప్పాయి, మిరప, కూరగాయ పంటలు, పుచ్చ, మొక్కజొన్న, వరి గంటలను తీసుకువచ్చి ప్రదర్శించారు. వాటిని సీఎం కేసీఆర్ తీక్షణంగా పరిశీలించారు.

రెడ్డికుంట తండాలో..



సీఎం: ఈ చేను ఎవరిది?
మంత్రి దయాకర్‌రావు: సార్ ఇతనిదే..(రైతును చూపిస్తూ)
సీఎం: నీ పేరు ఏం పేరు..ఎన్ని ఎకరాలు మక్క వేసావు?
రైతు: నా పేరు చిన్న సోమ్లానాయక్ అయ్యా.. మూడెకరాల్లో మక్క వేసాను.
సీఎం: ఎంత పెట్టుబడి పెట్టావు?
రైతు: ఎకరానికి రూ.20 వేల దాకా మొత్తం రూ.60 వేలు పెట్టుబడి పెట్టాను. కంకి కోసే దశలో వడగళ్ల వానకు పంటంతా నాశనమైంది.
సీఎం: పంట ఏమైనా పనికి వస్తుందా?
ఏఓ: ఏం పనికిరాదు సార్. మొత్తం పంటంతా నాశనమైంది.
సీఎం: ధైర్యంగా ఉండండి మిమ్మల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ఉంది. ఎకరానికి రూ. 10 వేల చొప్పున పరిహారం అందిస్తాం.



సీఎం: ఈ మామిడి తోట ఎవరిది?
మంత్రి: ఈ తోట మన కార్యకర్త నెహ్రూనాయక్‌ది సార్.
రైతు: నాదే సార్. 25 ఎకరాల్లో మామిడి తోట. గాలివానకు కాయలు సగం రాలిపోయాయి.
సీఎం: ఉన్న కాయలు పనికివస్తాయా? (చెట్టుకు ఉన్న మామిడి కాయలు పరిశీలిస్తూ)
రైతు: పనికిరావు సార్..అంతా నష్టమే.
సీఎం: అధైర్యపడకు నెహ్రూనాయక్. ఇప్పటికే ఖమ్మంలో ప్రకటించాను. ఎకరాకు రూ.10 వేలు అందిస్తాం

అడవిరంగాపురంలో..



సీఎం: నీ పేరు ఏంటి
రజనీకర్ రెడ్డి: రజనీకర్ రెడ్డి అన్నాడు.
సీఎం: ఎన్ని ఎకరాల్లో ఏమేమి పండించినవ్
రజనీకర్ రెడ్డి: మూడెకరాల్లో మొక్కజొన్న, రెండెకరాల్లో వరి వేశాను సార్
సీఎం: ఆ తర్వాత మొక్కజొన్న పంట చూశారు.
రజనీకర్ రెడ్డి: ముందుకెళ్తే వరి కూడా ఉంది సార్.. కాస్తా దిగి చూడండి
సీఎం: కాస్తా ముందుకు వెళ్లి అందులో ఏముంది.. అంతా పోయింది.. మన్నుందా అని అన్నారు.
రజనీకర్ రెడ్డి: గతేడాది కూడా మొక్కజొన్న నష్టపోయాం సార్. ఇప్పటివరకు పరిహారం రాలేదు సార్.
సీఎం: ధైర్యంగా ఉండు.. ఇప్పుడే పరిహారం ప్రకటించానన్నారు.



సీఎం: ఎన్ని ఎకరాలు నష్టమైందమ్మా
సామ్రాజ్యం దంపతులు: రెండు ఎకరాలు మొక్కజొన్న, రెండు ఎకరాలు వరి
సీఎం: ఏమి అడగుతారు మరీ
సామ్రాజ్యం దంపతులు: రూ.లక్ష పెట్టుబడి అయింది. రైతు దెబ్బతిన్నాడు కదా. ప్రస్తుతం బ్యాంక్‌లో ఉన్న రుణాన్ని మాఫీ చేస్తే వ్యవసాయంలో ముందుకెళ్లొచ్చు.
సీఎం: చాలామంది రైతులకు నష్టం జరిగింది. అందరికీ ఎకరానికి రూ.10 వేలు ఇవ్వాలని నిర్ణయించా.
సీఎం: ఎన్ని గంటలకు వచ్చింది వర్షం
సామ్రాజ్యం దంపతులు: రాత్రి 12 గంటలకు వచ్చింది. పొద్దకా అయితే మనుషులం ఒక్కరూ కూడా బతుకకపోతుం. నీళ్ల కట్టేందుకు బావి కాడికి వచ్చేటోళ్లం. బావికాడికి వస్తే ప్రాణగండం ఉండేది.
సీఎం: మీతో పాటు అందరి అదృష్టం బాగుందమ్మా

సర్పంచ్, ఎంపీపీలను అడ్డుకున్న పోలీసులు

- ఏడుస్తూ ఇంటికి వెళ్లిన సర్పంచ్

దుగ్గొండి: సీఎం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రికి స్వాగతం పలకడానికి వెళ్లిన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం అడవిరంగాపురం సర్పంచ్ కొండం రమాదేవి, ఎంపీపీ కాట్ల కోమలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు అడ్డుకుంటున్నా ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు పట్టించుకోకుండానే వెళ్లిపోయారు. దీంతో వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ తరువాత అవమాన భారంతో సర్పంచ్ రమాదేవి దుఃఖితురాలై ఇంటికి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్ది ముఖ్యమంత్రి తిరిగి వెళుతున్న క్రమంలో రమాదేవిని పిలిపించారు. పోలీసులు మళ్లీ అడ్డుకోవడంతో గట్టిగా వాదించడంతో సీఎం వద్దకు చేరుకోగలిగానని, హెలికాప్టర్‌లో ఉండగా గ్రామాభివృద్ధికి నిధుల కోసం వినతిపత్రం అందించానని ఆమె తెలిపారు.


దుగ్గొండి: విలపిస్తూ వెళ్లిపోతున్న సర్పంచ్ రమాదేవి

రెడ్డికుంట తండావాసుల ఆందోళన


రెడ్డికుంట తండాలో ఆందోళన చేస్తున్న రైతులు

పెద్దవంగర: కేవలం ముగ్గురు రైతుల పంట నష్టం చూసిన సీఎం కేసీఆర్ ఇతర రైతుల పంట నష్టాన్ని పరిశీలించకపోవడం సరికాదని రెడ్డికుంట తండా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని రెడ్డికుంట తండాలో పంట నష్టపోయిన రైతులను పంటలను సీఎం కేసీఆర్ గురువారం పరిశీలించారు. ఈ నేపథ్యంలో మిగితా రైతులు ఆందోళన చేపట్టారు. తమకు జరిగిన పంటనష్టాన్ని ఎందుకు పరిశీలించలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ భూముల సమీపంలో సీఎం పంటలు పరిశీలించి తమను విస్మరించడం బాధ కలిగిస్తుందని బాధిత రైతులు వాపోయారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26841]

■GWMC అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో విల్లా ప్లాట్లు, 4 BHK డూప్లెక్స్ హౌజ్, 3 BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్ట్‌లో బుకింగ్స్ ప్రారంభమైనవి. సంప్ర: శ్రీనివాస్ 8978638094, 9949732488 [W-775800]

■ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26848]

■వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26847]

■హన్మకొండ నయీంనగర్‌లో H.No: 2-2-189/1 120 చ॥గ॥లలో గల House అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్. సెల్: 9030382583. [W-775799]

FLATS FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26840]

■HYDERABAD, KUKATPALLY Behind Metro Shopping Mall, Main Road. Maitri Nagar, GHMC Approved. 3BHK Flats. Ready to Occupy. Limited Flats with all amenities. Ph: 9347566287. [HA-1069]

PLOT FOR SALE

■మామునూర్ సెంటర్లో 347 చదరపు గజాల నార్త్ ఈస్ట్ కార్నర్ ప్లాటుకై సంప్రదించవల్సిన సెల్ నెం: 9032111600. [W-775798]

■GWMC - KUDA పరిధిలోని 3300 చ॥గ॥ ఏనుమాముల మార్కెట్ మేన్‌గేట్‌కి ఎదురుగా రోడ్ ఫేసింగ్ భూమి అమ్మకానికి కలదు. సంప్ర॥ 9440290009, 9441689294. [W-775797]

SERVICES

■హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785458]

■అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత, టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 8699691739. [T-1792]

బ్యూటీ పార్లర్

■ మా శైలి బ్యూటిపార్లర్‌లో బ్యూటిషియన్ కోర్సు Free గా నేర్పించి సెంట్రల్ గవర్నమెంట్ సర్టిఫికెట్ ఇవ్వబడును. మ్యారేజ్ Makeup, మెహింది చేయబడును. సంప్ర: 9989060668 [W-785462]

BUSINESS OFFER

■ Capro కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టుల కొరకు LAP & Agents కావలెను, మంచి జీతం + కమీషన్. ✆ 9319814720. [T-1196145]

WANTED

■ Wanted Receptionist Urgent. Male/ Female. Q: Any Degree. Good Communication in English must. Mandiwala Restaurant, Nakkalagutta, Hanamkonda. Cell: 9848092503. [WA-5284]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లోని షాపింగ్ మాల్స్ హాస్పిటల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & స్వీపర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥ 12 గం॥ డ్యూటీలు కలవు. జీతం: 10000-15000 సంప్ర॥ 9703637320 [W-785461]

■ వరంగల్, హన్మకొండ, కాజీపేటలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సాలరీ: 12000/- టైమింగ్స్: ఉ॥ 10 గం నుండి సా॥ 5గం॥ల వరకు. సంప్ర॥ 0870-3569177. [W-775796]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795262]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సెల్: 9573633520, 9059633520. [M-1190652]

■ శ్రీకృష్ణా ఓల్డేజ్ హోమ్‌కేర్ HYDలో పెద్ద వారికి పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీ: 16,000/- రూం+మీల్స్ ఫ్రీ. (ఏజెంట్ కమీషన్ కలదు) సంప్ర: 9000448989 [H-796825]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 9000408325. [G-795265]

■ పనివారు కావలెను. హైదరాబాద్, భువనగిరిలో గల చిన్న కుటుంబానికి ఇంట్లోనే ఉండి వంటపని, ఇంటిపని, తోటపని మొదలగు పనులు చేయుటకు భార్యాభర్తలు కావలెను. డి.బాలాజీ, భువనగిరి. ఫోన్: 9246969042, 9848175211 [V-1788]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/-రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బాల్య వివాహం అడ్డగింత

గూడూరు: ఓ బాలికకు పెళ్లి చేస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దార్ అశోక్‌కుమార్, ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ అధికారులు వెళ్లి పెళ్లిని గురువారం అడ్డుకున్నారు. ఈ ఘటన మండల కేంద్రంలో జరిగింది. అధికారుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పదో తరగతి చదువుతున్న కూతురుకు తల్లిదండ్రులు పెళ్లి చేస్తున్నారని గుర్తు తెలియని వ్యక్తులు ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన వారు స్థానిక తహసీల్దార్ అశోక్‌కుమార్, పోలీసులకు సమాచారం అందించి పెళ్లి జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. మరో అరగంటలో పెళ్లి తంతు ముగుస్తుందని తెలుసుకున్న వారు తల్లిదండ్రులను పిలిచి పెళ్లి కూతురు పుట్టిన తేదీ ఆధారాలు చూపించాలని కోరారు. దీంతో వారు స్కూల్ డేటాబర్త్ సర్టిఫికెట్ చూపారు. అందులో 17 సంవత్సరాలు ఉన్నాయని, మైనర్ కాబట్టి పెళ్లి చేయరాదంటూ అడ్డుకున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించి బాలికను తమ వెంట జిల్లా కేంద్రానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కౌన్సిలర్ నలమాస అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, సోషల్ వర్కర్ బి.వెంకన్న, పోలీసులు పాల్గొన్నారు.

అన్విక్ మృతదేహం లభ్యం

- హర్షిత్ కోసం గాలింపు

హసన్‌పర్తి: ఎస్సారెస్పీ కాల్వలో ఈతకు వెళ్లి బుధవారం గల్లంతైన పలివేల్పులకు చెందిన అన్నదమ్ముళ్లలో తమ్ముడు అన్విక్(9) మృతదేహం గురువారం గీసుకొండ సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలో లభ్యమైందని ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. హర్షిత్(16) మృతదేహం మాత్రం ఇంకా లభ్యం కాలేదని గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సారెస్పీ కాల్వలో అన్నదమ్ములు గల్లంతు కావడంతో అధికారులు గేట్లు మూసివేశారు. ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది.

బైక్ పైనుంచి పడి యువకుడి దుర్మరణం


హెచ్చు కిరణ్(ఫైల్)

గూడూరు: మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి ఓ యువకుడు కింద పడడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని అయోధ్యపురం, వాయిల్‌బంధం గ్రామాల మధ్యలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బొల్లెపల్లి ఎస్సీ కాలనీకి చెందిన హెచ్చు సారయ్య, యాకలక్ష్మి దంపతుల కుమారుడు కిరణ్ (22) డిగ్రీ చదువుతున్నాడు. కిరణ్, అతని బంధువు ఇద్దరు కలిసి ఉదయం బైక్‌పై వరంగల్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వస్తుండగా అయోధ్యపురం- వాయిల్‌బంధం మూలమలుపు వద్దకు బైక్ చేరుకోగానే అదుపు తప్పి పడిపోయారు. కిరణ్ అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఆ వైపున వెళ్తున్న వాహనదారులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని గాయాల పాలైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సతీష్‌గౌడ్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు..

ధర్మసాగర్: చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని ముప్పారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పారం గ్రామానికి చెందిన మత్స్యకార సంఘం అధ్యక్షుడు ల్యాగ యాదగిరి(55), సంఘం కార్యదర్శి మేకల శ్రీకాంత్ తో కలిసి గురువారం ఉదయం గ్రామంలోని పెద్ద చెరువులో చేపలు పట్టడానికి వెళ్లారు. ఈ క్రమంలో యాదగిరి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్లాట్లను కబ్జా నుంచి రక్షించండి..


ప్లాట్ల రిజిస్ట్రేషన్ పత్రాలు చూపిస్తున్న బాధితులు


- దేశాయిపేట భూ బాధితుల ఆవేదన

హన్మకొండ చౌరస్తా: కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లను కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నారని.. తమ భూములను రక్షించి ఆదుకోవాలని దేశాయిపేటకు చెందిన భూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో గురువారం సమావేశమైన భూ బాధితులు విలేకర్ల ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. వరంగల్‌లోని దేశాయిపేట సీకేఎం కళాశాల నుంచి ఎనుమాముల మార్కెట్‌కు వెళ్లే దారిలో జన్ను జకార్య, జన్ను అశోక్, వనపర్తి చేరాలుకు సర్వే నంబర్ 307/ఏలో 2.20 ఎకరాలు, 306 సర్వే నంబర్‌లో 2 ఎకరాలు, 306 ఏ సర్వే నంబర్‌లో 4 ఎకరాలు మొత్తంగా 8.20 ఎకరాల భూమిని 2010లో ప్లాట్లుగా చేసి విక్రయించారని తెలిపారు. తాము డబ్బులు చెల్లించి ప్లాట్లు కొనుగోలు చేసి అప్పుడే రిజిస్ట్రేషన్ చేసుకున్నామని తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసి 13 సంవత్సరాలు అవుతుండగా ఏడాది కాలంగా కొందరు ఈ స్థలం తమదేనంటూ తమ ప్లాట్లలో తాత్కాలికంగా నిర్మించిన షెడ్లను జేసీబీతో కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్ కోసం చిన్న చిన్న ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన స్థలాన్ని పలువురు కబ్జా చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఇదేమి న్యాయమని ప్రశ్నిస్తే తమను చంపుతామంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. కబ్జా విషయాన్ని సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై సీపీ స్పందించి తగిన న్యాయం చేస్తారనే నమ్మకం ఉందని వివరించారు. ఈ సమావేశంలో భూ బాధితులు ఎస్.నటరాజ్, పి.రాజయ్యగౌడ్, బి.కృష్ణమూర్తి, ఉప్పుల ప్రణీత్, ఉప్పుల ఇందనీల, మరుపాక దయాకర్, ఎండి.సులేమాన్, ఏ.లింగయ్య, ఎండీ.తాజుద్దీన్, ఎండీ.ఖాజాపాషా, సాజీద్, ఖాజా, అజార్‌అహ్మద్, ఫారుఖుద్దీన్, అతీకసుల్తానా, పెండ్యాల రవి, బండారి శ్రీనివాస్, బి. మారుతి, శ్రీపతి బక్కయ్య, ఎస్ రవీందర్‌రెడ్డి, కె.కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక చోరీ.. మరో చోరీకి యత్నం

- బ్యాంకులో దొంగతనానికి యత్నించి విఫలం
- గ్యాస్ కట్టర్, సిలిండర్ అక్కడే వదిలేసి పారిపోయిన దొంగలు

మల్హర్: ఆ దొంగలు బ్యాంకులో దొంగతనం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు అవసరమైన సామగ్రిని కూడా ఓ వెల్డింగ్ షాపులో దొంగిలించి.. బ్యాంకులో చోరీకి విఫలయత్నం చేసిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కాటారం సీఐ రంజిత్‌రావు కథనం ప్రకారం.. మండలంలోని కొయ్యూరు-కాటారం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న భవనంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉంది. కొందరు ఆగంతకులు మంగళవారం అర్ధరాత్రి బ్యాంకు ముందున్న గల్లీలోని గేటుకు ఉన్న తాళాన్ని తమ వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్ సాయంతో తొలగించి గల్లీలోకి వెళ్లారు. మరోసారి గ్యాస్ కట్టర్‌తో బ్యాంకుకు ఉన్న కిటికీ గ్రిల్స్‌ను ధ్వంసం చేసి లోపలికి వెళ్లేందుకు విఫల యత్నం చేశారు. కానీ.. అది విఫలం కావడంతో కట్టర్, సిలిండర్‌ను అక్కడే వదిలేసి పారిపోయినట్లు సీఐ తెలిపారు. బుధవారం బ్యాంకుకు సెలవు దినం కావడంతో గురువారం బ్యాంకుకు వచ్చిన అధికారులు గేట్ తాళం పగులగొట్టి ఉండటం, సిలిండర్, కట్టర్ అక్కడే ఉండటాన్ని గమనించారు. బ్యాంకు లోపలికి వెళ్లి పరిశీలించారు. కిటికీ కట్ చేయడానికి ప్రయత్నించిన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో దొంగతనానికి ప్రయత్నించినట్లు గుర్తించి బ్యాంకు మేనేజర్ అవినాష్ కొయ్యూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


బ్యాంకు గల్లీలో గేట్, గ్యాస్ కట్టర్‌ను వదిలేసి వెళ్లిన దొంగలు